

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## కాంచన సీత

**"నేను చస్తే** ఒప్పుకోను" సుచిత్ర అరిచింది.

"నేను బాబాయ్‌కి మాటిచ్చేసాను. ఇప్పుడు వద్దని ఎలా చెప్పను?" అంతకంటే పెద్దగా అరిచాడు ఉదయ్.

"మాటివ్వబోయేముందు నాతో ఒక్కమాట చెప్పొద్దా?"

"అంటే నీ పర్మిషన్ తీసుకోవాలా?"

"ఖచ్చితంగా."

ఆ వాదన అరగంటనించి సాగుతోంది. ఎవరూ తగ్గడం లేదు. ఈ గొడవకి మూలకారణం ఉదయ్ తన బాబాయ్‌కి ఇచ్చిన మాట.

ఆ మధ్యాహ్నం ఉదయ్‌కి బాబాయ్ నించి ఫోన్ వచ్చింది.

"ఓ సహాయం చేయ్యాలా అబ్బాయ్" ఆయన ఉపోద్ఘాతంగా చెప్పాడు.

"నేను నీకేం సహాయం చేయగలను బాబాయ్?" ఉదయ్ నవ్వేసాడు.

"మన వంశీకి ఇంతదాకా ఉద్యోగం రాలేదురా. 'హైదరాబాద్‌లో ఏవో కంప్యూటర్ క్లాసుల్లో చేరతాను' అంటున్నాడు. అక్కడ రూముల్లో ఉంచితే పిల్లాడు చెడిపోతాడు. ఆ కోర్సులేవో అయ్యేదాకా వాడిని మీ ఇంట్లో ఉంచుకుంటావేమోనని..." ఆయన సందిగ్ధంగా చెప్పాడు.

"అయ్యో! అందులో ఏముంది బాబాయ్. వాడ్ని వచ్చేయమను" ఉదయ్ ఉదారంగా మాటిచ్చేసాడు.

సాయంత్రం ఆఫీస్ నించి వచ్చాక సుచిత్రకి చెప్పాడు.

"మన థర్డ్ బెడ్‌రూం కొంచెం క్లీన్ చెయించి బెడ్ షీట్స్ మార్చు."

"ఎందుకు?" సుచిత్ర అయోమయంగా అడిగింది.

"మా బాబాయ్ కొడుకు వంశీ ఏవో కంప్యూటర్ కోర్సుల్లో చేరడానికి వస్తున్నాట్ట. మన ఇంట్లోనే ఉంటాడు."

"నేను చస్తే ఒప్పుకోను" సుచిత్ర అరిచింది.

"ఒక్క మనిషికి వండిపెట్టడానికి అంత బాధపడిపోతున్నావా? లేక డబ్బు ఖర్చవుతుందనా?" ఉదయ్ వెటకారంగా అడిగాడు.

"పనులకి నేనెప్పుడూ జడవను. ఆ వంశీ ఒక వెధవ. వదిన అనే గౌరవం కూడా లేకుండా ఎలా చూస్తాడో తెలుసా? వాడ్ని ఇంట్లో ఉంచుకుని ఇరవైనాలుగ్గంటలూ భరించడం నావల్ల కాదు. నాకు ఫ్రీగా ఉండదు. కుళ్ళు జోకులు వేస్తూ మనుషుల్ని తాకుతూ వికార చేష్టలు చేస్తాడు."

సుచిత్ర చెప్పింది.

"నువ్వేదో రంభా ఊర్వశి అనుకుంటున్నావేమో? ఎప్పుడూ ఇదే గోల. పక్కింటి డెబ్బై ఏళ్ళాయన వెకిలి చూపులు చూస్తుంటాడు అని అటువైపు కిటికీ తలుపులు తెరవనివ్వవు. వీడేమో వదిన కదా అని ఏదో చనువుగా మాట్లాడితే విపరీతార్థాలు తీస్తావు" కోపంగా చెప్పాడు ఉదయ్.

"ఎదుటివాడి చూపులని అర్థంచేసుకోడానికి రంభా, ఊర్వశీ కానక్కర్లేదు. ఆడదైతే చాలు. మీ తమ్ముడు ఉన్నంతకాలం నేను మా అక్క ఇంటికి పూనే వెళ్తాను. అంతే"

"మరిది పనికిరాడు కానీ, బావగారు పనికొస్తారు కాబోలు" ఉదయ్ అనాలోచితంగా అన్నాడు.

"ఛీ!" సుచిత్ర భర్తవైపు నిప్పులు కక్కేలా చూస్తూ పిల్లలగదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది.

పదిరోజులుగా ఆ కోల్డ్ వార్ సాగుతోంది. సుచిత్ర సాధ్యమైనంతవరకు భర్త కంటపడటంలేదు. పొద్దున్నే లేచి బ్రేక్ ఫాస్ట్, లంచ్ పేక్ సిద్ధం చేసి డైనింగ్ టేబుల్ మీద పెడుతుంది. అతను ఆఫీస్‌కి వేసుకెళ్ళాల్సిన దుస్తులు హేంగర్‌ని అల్మైరా హేండిల్‌కి తగిలిస్తుంది. అతను ఆఫీస్‌కి వెళ్ళాక బయటకి వచ్చి బెడ్రూంలోని పక్క బట్టలు సర్ది, పనమ్మాయితో శుభ్రం చేయిస్తుంది. సాయంత్రాలు అతను వచ్చేసరికి డిన్నర్ సిద్ధంగా ఉంటుంది.

ఇంట్లో మాట్లాడే మనిషి లేకపోవడంతో ఉదయ్ ఆలస్యంగా ఇంటికి వస్తున్నాడు. తను అనాలోచితంగా అన్నమాట సుచిత్రని ఎంత హర్ట్ చేసి వుంటుందో అతనికి తెలుసు. ఆమె కంటే ఇరవైఏళ్ళు పెద్దయిన బావగారు తనకి తండ్రిలాంటివాడని సుచిత్ర అనేకసార్లు చెప్పింది. తల్లితండ్రులు లేని సుచిత్రకి అక్క ఇల్లే పుట్టిల్లని కూడా ఉదయ్‌కి బాగా తెలుసు. కానీ క్షమాపణ చెప్పడానికి అతనికి చిన్నతనంగా తోచింది.

వంశీ రాకగురించి అతను తల్లితో చెప్పినప్పుడు ఆవిడ చివాట్లేసింది. "నాకు ఒక్క ఫోన్ చేసి మాట్లాడాలని కూడా తట్టలేదట్రానీకు? వాడో దౌర్భాగ్యుడు. వాడిని తెచ్చి ఇంట్లో పెట్టుకుంటే మసే. ఇక్కడ ఎవరో పిల్లతో ప్రేమా దోమ అని కాలక్షేపం చేసి నువ్వెవరో తెలీదు పొమ్మన్నాట్ట. దాంతో ఆ పిల్ల వీడితో ఉన్న ఫోటోలు, వీడి మెసేజ్‌లు తీసుకుని పోలీసులకి కంప్లైంట్ ఇచ్చింది. ఈ సంగతి తెలిసి మీ బాబాయ్ వాడిని నీ దగ్గరకి పంపించాలని బస్సెక్కించబోయాడు. ఈలోగానే పోలీసులు పట్టుకెళ్ళి మంచిపని చేసారు. మరి ఆ పిల్లతో పెళ్ళి చేస్తారేమో? అప్పుడు కానీ రోగం కుదరదు దరిద్రుడికి.."

ఉదయ్ లో పశ్చాత్తాపం పెరిగిపోయింది. కానీ భార్య దగ్గర తప్పు ఒప్పుకోడానికి అతనిలోని అహం అంగీకరించలేదు. ఆమెతో రాజీపడే ప్రయత్నాలు ఏమీ చేయకుండా నిశ్శబ్దంగా ఉండసాగాడు.

దాదాపు మూడు వారాల తర్వాత సుచిత్రకి ఉదయ్ నించి ఒక ఇ-మెయిల్ వచ్చింది. నిజానికది ఓ ఫార్వర్డ్, అతని స్నేహితుడు రాజానించి వచ్చినది.

**'ఒరేయ్ ఊ!**

మీ ఊరు వచ్చేస్తున్నారోయ్! సరారరి మీ ఇంటికే. మా హే కూడా వస్తోంది. బీ రెడీ. ఫోర్‌డేస్. నాలుగురోజులు నీతోనే. లీవ్ పెట్టేయ్. మండేనించి థర్స్‌డే దాకా. ఫ్రైడే సంగతి అప్పుడాలోచిద్దాం.

**టాటా.**

**నీ.**

**రా.**

సుచిత్రకి బాధ, కోపం, ఉక్రోషం ఏకకాలంలో కలిగాయి. ఉదయ్ దాన్ని ఫార్వర్డ్ చేసిన అంతరార్థం కూడా అర్థమైంది. ఆమె మనసు ప్రతిఘటిస్తోంది. నిస్సహాయంగా మంచం మీద పడి దాదాపు పావుగంటసేపు ఏడుస్తూనే వుంది.

సోమవారం పొద్దున ఏడుగంటలకే కాలింగ్ బెల్ మోగింది. అప్పటికే లేచి, స్నానంకూడా చేసి అతిథులకోసడి బ్రేక్ ఫాస్ట్ తయారు చేస్తున్న సుచిత్ర వెళ్ళి తలుపు తీసింది. ఓ చేత్తో సూట్‌కేస్ నెట్టుకుంటూ రాజా లోపలికి వచ్చాడు. వెనకే అతని భార్య హేల హేండ్ బేగ్‌తో వచ్చింది.

"హలో సుచిగారూ" మొహమాటంగా పలకరించింది.

సుచిత్ర ఆమెని వారి పెళ్ళిలోనే చూసింది. అప్పటికి, ఇప్పటికి హేల బాగా మారింది అనుకుంది.

రాజా బెడ్రూమ్‌లోకి వెళ్ళి నిద్రపోతున్న ఉదయ్ పక్కన పడుకుని గాఢంగా కౌగలించుకున్నాడు.

"అరే ఊ. ఎన్ని రోజులైందిరా నిన్ను చూసి."

ఉదయ్ అంతే ఆనందంగా స్నేహితుడిని చూసి, లేవబోయి లేవలేక అరిచాడు.

"ఒరేయ్! నీ భల్లూకం పట్టు వదులుతావా?"

మిత్రులిద్దరూ పడుకునే కబుర్లు చెప్పుకోసాగారు. సుచిత్ర హేలని బెడ్‌రూంలోకి తీసుకెళ్ళి చెప్పింది.

"ఫ్రెష్ అయివస్తే బ్రేక్‌ఫాస్ట్ తినేయచ్చు. గీజర్ ఆన్‌లోనే ఉంది"

"ముందు నాకు కాఫీ ఇవ్వండి సుచీ. తర్వాత చూద్దాం మిగిలినవి" హేల అలసటగా చెప్పింది.

రాజాతోపాటు బయటకి వచ్చిన ఉదయ్, హేలకి కాఫీ కప్ అందిస్తున్న సుచిత్రని చూసి నిర్ఘాంతపోయాడు. ఈ నెలరోజుల్లో ఆమె ఐదారు కిలోలైనా బరువు తగ్గివుంటుంది. మరింత తెల్లబడింది. లేదా పాలిపోయింది. చెంపలు పల్చగా ఉన్నాయి.

రాజాకూడా ఆ మార్పుని గ్రహించి చెప్పాడు.

"మైగాడ్! సుచీ ఇంత సన్నగా అయ్యారేంటీ? ఆ రహస్యం ఏమిటో మా హే కి కూడా చెప్పండి ప్లీజ్" అతను రెండక్షరాల్లో పిలిచే పేరు ఒక్క సుచీనే.

సుచిత్ర ఓసారి ఉదయ్ వంక చూసి చెప్పింది. "హేల చక్కగా ఉంది. ఇంక చిక్కక్కర్లేదు."

సుచిత్ర యాంత్రికంగా ఆ ఇద్దరికి కూడా కాఫీలిచ్చింది.

"మా అమ్మ మేనమామ పదిరోజుల క్రితం పోయాడు" రాజా బ్రేక్ ఫాస్ట్ దగ్గర చెప్పాడు.

"అయ్యో పాపం!" ఉదయ్ అప్రయత్నంగా అన్నాడు.

"పాపమా? పాపం ఏమిటి? మా అమ్మకి మేనమామ అని చెప్తున్నాగా? నైన్టీ ప్లస్‘ నేను వెళ్ళలేను. మోకాళ్ళ నొప్పులు. నువ్వు మాత్రం పదోరోజుకి వెళ్ళి ఆ మూడురోజులు అక్కడే వుండు‘ అని మాతృశ్రీ ఆజ్ఞ జారీ చేసింది. ఇంకో ఊరైతే వెళ్ళేవాడ్ని కాదుకానీ, హైదరాబాద్ అనగానే నీతో నాలుగురోజులు గడపచ్చని వచ్చేసా. మా హే నేనుకూడా వస్తానని వెంటబడితే పాపం నేను కాకపోతే ఎవరు తీసుకెళ్తారు‘ అని తనని కూడా పట్టుకొచ్చా" ఇడ్లీ తింటూ చెప్పాడు రాజా.

"పట్టుకొచ్చావా? నేనేమైనా బిస్కెట్ పాకెట్టో, పాలపాకెట్టో అనుకుంటున్నావా?" కయ్‌మంది హేల.

"సారీ! సారీ! అదే నాతో తీసుకొచ్చానని చెప్తున్నా" రాజా వినయంగా చెప్పాడు.

"అసలు నన్నెందుకు తెచ్చావని ఉదయ్‌గారు అడిగారా? పేర్లని షార్ట్‌కట్‌లో పిలవటమే కాదు. మాటలు కూడా షార్ట్ కట్‌లో మాట్లాడాలి" హేల అతని వీపు మీద చరిచి చెప్పింది.

ఉదయ్‌కి ఎందుకో అపరిమితమైన బాధ కలిగింది. ఆ సంఘటనకి ముందు తామిద్దరూ కూడా అలాగే సరదాగా ఉండేవాళ్ళు. బాబాయ్ మూలంగా అనవసరంగా గొడవలు. ‘ఈ చుట్టాలకి ఎంత దూరంగా వుంటే, అంత ప్రశాంతంగా ఉంటుంది‘ అనుకున్నాడు.

"లంచ్ ఏం చేయను?" సుచిత్ర రెండోసారి కాఫీలిస్తూ అడిగింది.

"నేను, వీడు తద్దినం వంట తింటాం. మీకేం కావాలో మీరే చేసుకోండి" రాజా చెప్పాడు.

"నేనెందుకురా చావింటికి?" ఉదయ్ మొహమాటంగా అడిగాడు.

"సెంటిమెంటా? మొహమాటమా?"

"మొహమాటం"

"ఏం పర్లేదు. హే ‘రానుపో‘ అంది. అక్కడెవరూ తెలీదు. నువ్వు వస్తే మనం కబుర్లు చెప్పుకోవచ్చు. మళ్ళీ చావిల్లు అనకు. అంత పెద్దాయన పోతే ఎవరూ బాధపడరులే" రాజా నవ్వేసాడు.

"హిమాయత్ నగర్‌లో నా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళొస్తాను. డ్రాప్ చేయండి" హేల చెప్పింది.

"ఐతే సుచీ ఇంట్లో మీరొక్కరే. ఏ పీజానో ఆర్డర్ చేసుకోండి" రాజా సలహా ఇచ్చాడు.

పదకొండింటికల్లా అంతా వెళ్ళిపోయారు. సుచిత్ర మంచం మీద వాలిపోయింది. భర్తకి ఎదురవడం, అతనికి స్వయంగా కాఫీ ఇవ్వడం ఆమెకి నచ్చలేదు. కానీ ఏమీ చేయలేని నిస్సహాయత. అత్తగారు ఫోన్ చేసి మరిది కొడుకు నిర్వాకం, అతన్ని జైల్లో పెట్టిన వైనం ఆనందంగా వివరించారు. కొడుక్కి కూడా చెప్పానని చెప్పారు. అంటే ఉదయ్‌కి తను చెప్పింది నిజమే అని అర్థమైవుంటుంది. కానీ కనీసం సారీ అని టెక్స్ట్ మెసేజ్ కానీ, ఈ మెయిల్ కానీ ఇవ్వలేదు. పైగా తండ్రిలాంటి బావగారి గురించి నీచంగా మాట్లాడాడు. ఆ మాటకి క్షమాపణ చెప్పినా తను ఉదయ్‌ని క్షమించలేదు.

ఇల్లాలు అంటే ఇంతేనా? అన్నిటికీ రాజీపడాల్సిందేనా? తనని ఇష్టం వచ్చిన మాటలని కనీసం సారీ కూడా చెప్పని మనిషి, స్నేహితుడి కుటుంబం వస్తుందనగానే ఇండైరెక్ట్‌గా ఏమీ జరగనట్లు వుండు, అతిథి సత్కారాలు చెయ్యి అని చెప్పాడు. ఉదయ్ తనకిచ్చిన విలువ ఏంటి?

‘పక్కింటి ముసలాయన ఎంత లోతుగా చూస్తాడంటే, ఒంటిమీది దుస్తుల్ని ఒలిచి చూస్తున్నట్లుంటుంది‘ అని తను ఉదయ్‌కి ఎన్నిసార్లో చెప్పింది. రంభవా? ఊర్వశివా? అన్నాడు. ఎంత హేళన!

నాలుగ్గంటలకి హేలని పికప్ చేసుకుని ఇంటికి వచ్చారు రాజా, ఉదయ్.

"భోజనం ఎంత హెవీ అయిందో" రాజా పొట్ట తడుముకుంటూ ఆయాసంగా చెప్పాడు.

"నా ఫ్రెండ్ ఇంట్లో లంచ్ చెత్తగా వుంది. అన్నీ ఉప్పు మయం." హేల చెప్పింది.

"సుచీ మీరేం వండారు?" రాజా అడిగాడు.

"నేనా!" సుచిత్ర తడబడింది.

"అంటే మీరు లంచ్ స్కిప్ చేసారు. ఇప్పటికే చాలా చిక్కారు. 'ఏరా ఊ ' నువ్వేమన్నా డైటింగ్ చేయమన్నావా?" రాజా అడిగాడు.

"ఆకలి లేక తినలేదు. అంతే. డైటింగ్ కాదు" సుచిత్ర చెప్పింది.

"అనవసరంగా వెళ్ళాను మా ఫ్రెండింటికి. ఇక్కడే ఉంటే హాయిగా ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ లంచ్ తినేవాళ్ళం" హేల చెప్పింది.

"అదేం? వచ్చేదాకా 'నా ఫ్రెండ్ దగ్గరకి వెళ్తా. ఉదయ్ ఇల్లు హిమాయత్‌నగర్‌కి దగ్గరేనా? టూ టైమ్స్ వెళ్తా. కుదిరితే నైట్ అవుట్ చేస్తా' అని చెవిలో ఇల్లు కట్టుకుని చెప్పావుగా? ఇప్పుడు అనవసరం అంటున్నావేంటి?" రాజా అడిగాడు.

హేల ఓ క్షణం తటపటాయించి చెప్పింది "ఇంట్లో వాళ్ళాయన వున్నాడు. దున్నపోతు వెధవ. ఎలా చూసాడో తెలుసా? ఒంటిమీది బట్టలు వలిచి చూసినట్లు చూసాడు. మేమిద్దరం మాట్లాడుకుంటుంటే, మధ్యలో వచ్చి కుళ్ళు జోకులు."

ఉదయ్ చటుక్కున సుచిత్ర వంక చూసాడు. ఆమె కళ్ళు దించుకుని వుంది. రాజా మొహం కోపంతో ఎర్రబడింది.

"ఎవడా రాస్కెల్? రేపు నేనూ వస్తాను పద. వాడి సంగతి తేలుస్తా" ఆవేశంగా అరిచాడు.

"తగ్గరా. ఏమో అతను మంచివాడేనేమో? హేల అతని చనువుని అపార్థం చేసుకుని వుంటుంది" ఉదయ్ అనునయించాడు.

"అపార్థాలు, పొరపాట్లు ఏమీ ఉండవురా. లేడీస్‌కి ఓ సహజసిద్ధమైన ఇన్‌స్టింక్ట్ ఉంటుంది. ఎవడు మామూలుగా చూస్తున్నాడు, ఎవడు కామకంగా చూస్తున్నాడో వాళ్ళు ఠక్కున చెప్పగలరు. హేని ఆ దృష్టితో చూసిన వాడి మొహాన పంచ్ ఇవ్వాలని వుంది.  హే మీద ఈగెకాదు. పాడు చూపులు వాలినా నేను సహించలేను."

రాజా భార్య భుజం చుట్టూ చేతిని వేసి చెప్పాడు.

సుచిత్ర చురుగ్గా భర్తవంక చూసింది.

"భర్తనించి ఆ రక్షణ, భరోసా ఉండాలి రాజా. హేల మరోసారి ఆ ఇంటికి వద్దులెండి" సుచిత్ర మృదువుగా చెప్పింది.

రాత్రి వంటలో సహాయానికి వచ్చిన హేలని నెమ్మదిగా అడిగింది.

"మనిద్దరం ఒక రూంలో పడుకుందామా? ఫ్రెండ్స్ ఇద్దరూ తెల్లార్లూ కబుర్లు చెప్పుకుంటారు."

"అమ్మో! ఏమీ అనుకోకండి సుచీ. పెళ్ళయినప్పటినించి రాజా పక్కన లేందే నిద్రపట్టడంలేదు. అందుకనే వెంటబడి వచ్చా. పగలంతా మాట్లాడుకుంటూనే ఉన్నారుగా చాల్లే" హేల నవ్వుతూ చెప్పింది.

దాదాపు నెలరోజుల తర్వాత ఆ రాత్రి మొరాయిస్తున్న మనసుని సముదాయిస్తూ సుచిత్ర తమ బెడ్‌రూంలో అడుగుపెట్టింది. ఉదయ్ మెయిల్స్ చూసుకుంటున్నాడు. అతని పక్కన మంచం చివరికి పడుకుంది సుచిత. అతన్నించి 'సారీ' అన్న ఒక్కమాట కోసం ఆమె ఒళ్ళంతా చెవులు చేసుకుని సిద్ధంగా ఉంది కానీ, అతను లైటార్పేసి అటు తిరిగి పడుకున్నాడు.

హేల, రాజా ఉన్న నాలుగురోజులు సరదాగా క్షణం తీరికలేకుండా గడిచాయి. నాలుగోరోజు సాయంత్రం వాళ్ళని ఏర్‌పోర్ట్‌లో డ్రాప్ చేయడానికి వెళ్ళాడు ఉదయ్.

తన వస్తువులన్నీ మళ్ళీ తన గదిలో సర్దుకుంటూ నవ్వుకుంది సుచిత్ర. అశ్వమేధయాగం పూర్తిచేయడానికి శ్రీరామచంద్రుడు మనసు స్పందనలేని బంగారు సీతని పక్కన ఉంచుకుంటే, ఫ్రెండ్స్ ముందు పరువు కాపాడుకోవాలని ఉదయ్ మనసుని చంపేసి, స్పందనలేని సుచిత్రని పక్కన ఉంచుకున్నాడు.

సీత జాడ తెలియని రాముడు అలా చేస్తే, స్త్రీ హృదయం తెలీని ఉదయ్ ఇలా చేసాడు. యుగాలు మారినా మగవాళ్ళు ఇంతేనేమో?

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

**Click here to share your comments**